ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

హామీలకు ఆకాశమే హద్దు!

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ నుంచి తప్పించుకుంటున్న 'కూటమి'
- గంగవరం పోర్టు కాలుష్యంపైనా మాటలకే పరిమితం
- విశాఖ ఐటిపై కోటలు దాటే మాటలు.. టిసిఎస్, ఉర్సా కంపెనీలకు ల్యాండ్ మూటలు
- కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు యథాతథం
- నగరంలో ట్రాఫిక్ కట్టడికి చర్యలు శూన్యం
- పంచగ్రామాలపై కొనసాగుతున్న అదే వంచన
- విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ప్రతిసారీ ప్రకటనలు..



గాజువాక సభలో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

'మాటలు కోటలు దాటినా ఆచరణ మాత్రం గడప దాటదు' అన్న సామెతను గుర్తుకు తెచ్చేలాగ 'కూటమి' పార్టీల ఏడాది పాలన తీరు కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖనగరం, జిల్లాకు సంబంధించిన ఆయన సహా స్థానిక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. విశాఖను పారిశ్రామిక, ఐటి, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చంద్రబాబు పలు సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నారు. ఏడాది కాలంలో విశాఖకు ఒక్క ఐటి కంపెనీ తెచ్చిందీ లేదు. వచ్చిందీ లేదు. ఈ పేరుతో 99 పైసలకే టిసిఎస్, ఉర్సా కంపెనీలకు సుమారు 100 ఎకరాలకు పైగా రుషికొండ ఐటి హిల్‌పై ప్రభుత్వం కేటాయింపులు చేయడం ప్రభుత్వం విమర్శలకు గురైంది.

విశాఖనగరాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో 'ట్రాఫిక్', పంచగ్రామాలు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, కొండవాలు ప్రాంతాలకు రక్షణ, గంగవరం పోర్టు కాలుష్యం, గాజువాక ప్రాంతంలో డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు, నగరంలో పలుచోట్ల రైతుబజార్ల ఏర్పాట్లు, హనుమంతవాక ఫ్లై ఓవర్ నిర్మాణం, తగరపువలసలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు, తీరం కోతకు గురికాకుండా భీమిలిలో చర్యలు వంటి పలు సమస్యలపై 6 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోనూ హామీలను కూటమి నేతలు గుప్పించారు. ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన వివిధ తరగతుల ప్రజానీకం ఎన్నికల నాటి హామీలను గుర్తుకు తెచ్చుకుని తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు.

ట్రాఫిక్ భూతం...

అధికారంలోకి వస్తే విశాఖను పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడతానని, 'మా వైజాగ్ ప్రజలు ఇక్కడ ఎంత ఇబ్బందులు పడుతున్నారో అర్థమవుతోంది. ఫ్లై ఓవర్‌లు తీసుకొస్తా' అంటూ గాజువాక 2024 ఎన్నికల ప్రచార బహిరంగ సభలో స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. ప్రధానమైన హనుమంతవాక నుంచి ఇసుక తోట జంక్షన్ వరకూ పెద్ద ఎత్తున రోజూ వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారంలోకి వచ్చాక విశాఖ ఎయిర్‌పోర్టులో జిల్లా అధికారులు, కూటమి ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించిన చంద్రబాబు ట్రాఫిక్ సమస్య గురించి గానీ, ఫ్లై ఓవర్ల నిర్మాణం గురించి ప్రస్తావించలేదు. ట్రాఫిక్ సమస్యపై అధికారులు నివేదించడానికి సిద్ధమైనా సిఎం చంద్రబాబు మిగతా 2లో..

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖపట్టణం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 13వ తేదీన విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పరిశీలించారు. నోవాటెల్, విఎంఆర్‌డిఎ డెక్ భవనం, చిల్డ్రన్ ఎరీనాను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, డిసిపి అజిత, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ప్రాథమిక సమాచారం మేరకు 13వ తేదీ ఉదయం మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ ఆధ్వర్యాన నోవాటెల్ హోటల్లో రెన్యువబుల్ ఎనర్జీ వర్క్‌షాప్ ఉంటుంది. మధ్యాహ్నం అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరగనుంది. అనంతరం విఎంఆర్‌డిఎ పరిధిలో నూతనంగా నిర్మించిన డెక్ భవనం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం జరగనున్నాయి. కొన్ని పారిశ్రామిక సంస్థలు, ఐటి సంస్థలతో ఒప్పందాలు (ఎంఒయు) జరగనున్నాయి. తదుపరి విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాకు చేరుకుని వివిధ పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానున్న వేదికలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చీ తదితరులు

రూ.25 కోట్ల విలువైన చెరువు హాంఫట్!

వార్త 5లో..

పని గంటల పెంపుపై సిఐటియు నిరసన

వార్త 7లో..

అధైర్యపడొద్దు
విశాఖ డెయిరీ కార్మికులకు సిఐటియు అండ

వార్త 8లో..

మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం : జెసి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అన్ని జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఉన్న పిల్లల మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం అందజేయాలని నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సన్న బియ్యాన్ని విశాఖపట్నం జిల్లాలో ఉన్న 582 ప్రభుత్వ పాఠశాలలకు, 70 సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన 11,691 ప్యాకెట్లు (25 కిలోలు) సరఫరా చేసినట్లు తెలిపారు.

పిహెచ్‌డి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎయిడెడ్ ప్రొఫెసర్లను తొలగించడంతో పరిశోధక విద్యార్థులకు గైడ్ లేని పరిస్థితి ఏర్పడిందని, పరిశోధనను ఎలా కొనసాగించాలో తెలియక వారు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, వారి హక్కులను పరిగణనలోకి తీసుకొని, యుద్ధ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఎయు కార్యదర్శి డి.వెంకటరమణ కోరారు. పిహెచ్‌డి విద్యార్థులు తీసుకున్న కోర్సులకు అనుగుణంగా కొత్త గైడ్‌లను నియమించి, వారి పరిశోధన సబ్మిషన్ గడువులోపే పూర్తి చేయగల అవకాశాన్ని కల్పించాలని, విద్యార్థుల అకడమిక్ ప్రయాణాన్ని అర్థాంతరంగా నిలిపేయకుండా, వారు నష్టపోకుండా విశ్వవిద్యాలయం, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయంలో పరిశోధన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల ఆసక్తిని బట్టి పరిశోధన మార్గదర్శకత్వం కేటాయించేలా చర్యలు చేపట్టాలని, ఒక పరిశోధనా స్కాలర్‌కు డిప్యూటెడ్ ఫ్యాకల్టీ కింద పిహెచ్‌డి చేయడానికి ఆసక్తి ఉంటే మార్గదర్శకత్వం కొనసాగించాలని, లేకుంటే విద్యార్థి ఆసక్తిని బట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, కోర్సు, అనుభవం, పరిశోధన రంగానికి అనుగుణంగా గైడ్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి బడులు

- పూర్తికాని గురువుల బదిలీలు
- రాని యూనిఫాం, బ్యాగులు
- పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి/ విశాఖ కలెక్టరేట్

వేసవి సెలవులు తరువాత గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. బడులు పున:ప్రారంభించిన రోజు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులకు అందేలాలేవు. విద్యార్థులకు ఇవ్వాల్సిన యూనిఫాం, బ్యాగ్, షూలు జిల్లాకు చేరలేదు. జిల్లాకు 5.13 లక్షల పాఠ్యపుస్తకాలు, 6.9 లక్షల నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 9,784, బెల్టులు 60,901 చేరాయి. బడికి వచ్చిన ప్రతి విద్యార్థికీ బ్యాగులో పుస్తకాలు, బెల్టులు, షూలు, యూనిఫాం పెట్టి అందిస్తామని ప్రభుత్వం గొప్పగా చెప్పింది. పాఠశాలలు తెరుచుకొనే నాటికి వాటిని అందించలేకపోయింది. ప్రతి విద్యార్థికీ మూడు జతల యూనిఫాం సరఫరా చేస్తామని ప్రకటించినా ఇప్పట్లో ఇచ్చే పరిస్థితి కనిపించలేదు. కొత్త బ్యాగుల పంపిణీలో ఇంకొన్ని రోజులు ఆలస్యంకానుంది. జిల్లాకు చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు మండలాలకు పంపించారు. అక్కడ నుంచి పాఠశాలలకు చేర్చి విద్యార్థులకు అందజేస్తామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లాలోని 1033 ప్రాథమిక పాఠశాలల్లో 23,194 మంది, 148 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 9,323 మంది, 226 ఉన్నత పాఠశాలల్లో 61,038 మంది విద్యార్థులున్నారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు 96,807 బ్యాగులు, 96,642 షూలు రావాల్సివుంది. బడులు ప్రారంభం నాటికి ఉపాధ్యాయుల బదిలీలు పూర్తిచేయలేదు. మరో నాలుగైదు రోజులు కౌన్సెలింగ్ ఉంటుంది. బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరేసరికి కొద్ది రోజులు సమయం పడుతుంది.

విశాఖ కలెక్టరేట్ : పున: ప్రారంభం నేపథ్యంలో జిల్లాలో అన్ని పాఠశాలలనె తెరిచేందుకు సిద్ధం మిగతా 2లో..

హామీలకు ఆకాశమే హద్దు!

చర్చ లేకుండా చేశారన్నది తెలుస్తోంది.

పంచ గ్రామాల భూ సమస్యకు....

తూర్పు, పశ్చిమ, పెందుర్తి సెగ్మెంట్లకు సంబంధించి పంచగ్రామాల సమస్య నెలకొంది. వాస్తవానికి 1990వ దశకంలో సమస్యను సృష్టించిన తెలుగుదేశం ప్రభుత్వం మూడు దఫాలుగా (ఇది నాలుగోసారి) అధికారంలో ఉన్నా సరైన పరిష్కారం చెయ్యలేదు. 2024 ఎన్నికల్లోనూ ఒక కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు. విజయనగరానికి చెందిన అనువంశిక ధర్మకర్త, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు సింహాచలం దేవస్థానం చైర్మన్‌గా ఉంటూ ఈ భూములను వదులుకోడానికి సిద్ధం కాకపోవడం, రైతులు, ప్రజల గురించి పట్టించుకోకపోవడంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. విశాఖను రాష్ట్రానికే కాదు దేశానికే ఆర్థిక రాజధాని చేస్తామంటూ చంద్రబాబు మొదలుకొని ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పని ఎన్నిక అంటూ ఏదీ లేదు. తాజాగా ముంబయి లాగ విశాఖను మార్చేస్తామంటూ కూడా ప్రకటించడం విశేషం. విశాఖ మెట్రో విషయంలోనూ ఇదే తంతు.

అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన హామీలు ఇలా...

గాజువాక అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రధానమైన స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని స్వయంగా చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ పలు దఫాలుగా గత ఎన్నికల్లోనూ, గాజువాక ప్రజాగళం సభలోనూ హామీలను గుప్పించారు. ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించేస్తున్నా, జీతాలు ఉద్యోగులకు ఇవ్వకపోయినా జోక్యం చేసుకోకుండా వారి ఉద్యమాన్ని అణచివేసేలాగ పోలీస్ బలగాలను గడిచిన నెలరోజులుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి భయానక వాతావరణం సృష్టించింది. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు 8వేల మంది, గంగవరం పోర్టు నిర్వాసితులు సుమారు 6వేల మందికి ఉద్యోగాలను ఇప్పించే బాధ్యత తమదని జగన్ ప్రభుత్వం 2019-2024 మధ్య ఏమీ చేయలేకపోయిందని, గంజాయికి హబ్‌గా విశాఖను మార్చేసిందంటూ చంద్రబాబు, టిడిపి నేతలు ఎద్దేవా చేస్తూ వచ్చారు. టిడిపి పాలనలోనూ ఈ సమస్యలు ఉపరిష్కారం కావడంలేదు. గంగవరం పోర్టు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం పాలౌతున్నారు. పరిష్కారం కాలేదు. గాజువాక నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు పరిస్థితి అక్కరకు రాలేదు.

కొండవాలు ప్రాంతాల సమస్యకు మోక్షం ఎప్పుడు...

తూర్పు నియోజకవర్గంలో కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తామని గత ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి హామీ ఇచ్చారు. ఇది అరకొరగానే జరిగింది. హనుమంతవాక నుంచి దీనదయాల్‌పురం వరకూ రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతోంది. దక్షిణ నియోజకవర్గంలో పోర్టు కాలుష్య సమస్య వన్‌టౌన్ ఏరియా ప్రజలనే కాదు నగరంలోని సీతమ్మధార, ఎంవిపి కాలనీల్లోకి కాలుష్యం జొరబడుతోంది. ఎమ్మెల్యేల హామీలు గాలిలో కలసిపోయాయి. ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు జరగడం లేదు. ఉత్తర నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం హామీ నెరవేరలేదు. సీతమ్మధార రైతు బజార్ అభివృద్ధి జరగలేదు. ఎఎస్‌ఆర్‌నగర్, ఇతర చోట్ల కొండవాలు ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఉత్తర నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే హామీ ఇచ్చినా అమలు కాలేదు. భీమిలిలో గంటా శ్రీనివాసరావు ఇచ్చిన హామీలు ఏమీ అమలు కాలేదు. తగరపువలసలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు కాలేదు. భీమిలి నోవోటల్ ఎదురుగా తీరం కోతకు గురికాకుండా రక్షణ గోడ నిర్మించలేదు. చిట్టివలస పెద్ద చెరువు సుందరీకరణ పనులు జరగలేదు. జివిఎంసి ఒకటో వార్డు తగరపువలసలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభం కాలేదు. 8వ వార్డు సాగర్‌నగర్‌లో రైతు బజారు ఏర్పాటు స్థల పరిశీలనకే పరిమితమైంది.

నేటి నుంచి బడులు

చేశారు. సెలవులు కారణంగా మూతపడ్డ పాఠశాలల తరగతి గదులు, పరిసరాలు దుమ్ము, ధూళి కమ్ముకొని ఉండటంతో రెండు రోజులుగా శుభ్రం చేస్తూ వచ్చారు. వన్ టౌన్ ప్రాంతంలోని క్వీన్ మేరీ పాఠశాలతో పాటు, పలు పాఠశాలలో పోర్టు కాలుష్యం బారిన పడి మసిబారాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు (ప్రీ హై స్కూల్) పాఠశాలలో సుమారు 1500 వరకు ఉన్నాయి. వీటిలో 30 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 270 ఉన్నాయి. 20 మంది లోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలు 36 ఉన్నాయి. విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్, మున్సిపల్,ప్రభుత్వ ఎయిడెడ్ అన్ని కలిపి సుమారు 534 పాఠశాలలు ఉన్నాయి. గురువారం పాఠశాలలు తెరుస్తున్నందున అన్నింటిని శుభ్రం చేయించాలని ఎంఇఒలకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

వర్కింగ్ జర్నలిస్టులకు త్వరలో వైద్య పరీక్షలు

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు త్వరలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్సు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం విశాఖపట్నం జిల్లా ఫెడరేషన్ యూనిట్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ 12 అంశాలపై వినతిపత్రం అందించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్కింగ్ జర్నలిస్టులకు వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమం పూర్తయిన వెంటనే వైద్య పరీక్షలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని, మీడియా కమిషన్ ఏర్పాటుచేయాలని, జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఎపిడబ్ల్యూజెఎఫ్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించాలని గంట్ల శ్రీనుబాబు కోరారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు భద్రత కల్పించాలని, మీడియా అకాడమీని బలోపేతం చేసి, ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులకు అవార్డులు ఇవ్వాలని, జర్నలిస్టులకు కార్మిక బీమా, ఆరోగ్య బీమా సదుపాయం వర్తింపజేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, పింఛను సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, విఎస్.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ బస్సు పాసుల జారీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గురువారం నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కావటంతో విద్యార్థులకు బస్సుపాసుల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. బస్ పాస్ అప్లికేషన్ ఆధునీకరిస్తున్న కారణంగా గురువారం బస్సు పాస్ కౌంటర్లకు సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. 13వ తేదీ నుంచి బస్సుపాసులు యథావిధిగా జారీ అవుతాయని వివరించారు. నగరంలోని ద్వారకా బస్ స్టేషను, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, ఎంవిపి, మధురవాడ, పెందుర్తి, కూర్మన్నపాలెం బస్ పాసు కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. విద్యార్థులు buspassonline.apsrtcpass.inలో ఫొటోతో వివరాలు నమోదు చేసుకొని అప్లికేషన్ ప్రింట్ తీసుకోవాలని పేర్కొన్నారు. ఆ అప్లికేషన్‌పై విద్యాసంస్థ ప్రిన్సిపల్, హెడ్మాష్టరుచే ధ్రువీకరణ చేయించి సంబంధిత డిపో కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. అప్లికేషన్స్‌తో ఆధార్, పదవ తరగతి పాసయిన విద్యార్థులు మార్కులిస్టు జెరాక్సు కాపీ తప్పక జతపరచాలని తెలిపారు. అప్లికేషన్‌పై ఫోన్ నెంబరు తప్పక రాయాలని పేర్కొన్నారు. అడ్మిషన్ లిస్టు తరగతుల వారిగా ప్రిన్సిపల్, హెడ్మాష్టరు సంతకంతో సంబంధిత డిపో మేనేజరు కార్యాలయానికి అందజేయాలని విద్యాసంస్థలకు సూచించారు. 12 సంవత్సరాల లోపు బాలురు, 18 సంవత్సరాల లోపు బాలికలు (10వ తరగతి వరకు) ఉచిత బస్సుపాస్, స్టూడెంటు జనరల్ బస్ పాస్ (ఇయర్లీ), స్టూడెంటు జనరల్ బస్ పాస్ (క్వార్టర్లీ), స్టూడెంటు జనరల్ బస్ పాస్(మంత్లీ), స్టూడెంటు గ్రేటర్ విశాఖ పాస్, స్టూడెంటు రూట్ పాస్, జెఒసి పాసులు పొందగోరే విద్యార్థులు సంబందిత డిపోలకు వెళ్ళి అప్లికేషను వెరిఫికేషన్ చేయించుకొని బస్సుపాస్ పొందవచ్చని తెలిపారు.

హెచ్‌ఎస్‌ఎల్‌లో సేఫ్టీ శిక్షణ

ప్రజాశక్తి - విశాఖపట్టణం: హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) కాంట్రాక్టు కార్మికులకు రెస్క్యూ 2.0 సేఫ్టీ-కమ్-ఫైర్ శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఎల్ సిఎండి హేమంత్‌ఖత్రి మాట్లాడుతూ, భద్రత కేవలం సమ్మతి అవసరం మాత్రమే కాకుండా ప్రధాన విలువగా ఉండాలని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు భద్రతాపరమైన సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. శిక్షణలో 250 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. అందరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన మరింత బాధ్యతాయుతమైన కార్యాలయాన్ని నిర్మించడానికి హెచ్‌ఎస్‌ఎల్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

సేఫ్టీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎస్‌ఎల్ సిఎమ్‌డి హేమంత్‌ఖత్రి

నేటి నుంచి ఇగ్నో వార్షిక పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2025 వార్షిక పరీక్షలు గురువారం నుండి ప్రారంభమవుతున్నాయని ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని, సుమారు 5000 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు హాల్ టికెట్లు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని, దానితో పాటు గుర్తింపు కార్డు తీసుకొని పరీక్షలకు హాజరు కావాలని కోరారు. మొబైల్ ఫోన్స్ తదితర సాంకేతిక ఉపకరణాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇగ్నో జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంవిపి.కాలనీ ఉషోదయ జంక్షన్‌లో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని లేదా సంబంధిత పరీక్షా కేంద్రాలను ముందుగానే సంప్రదించాలని సూచించారు.

పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో పిల్లల వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ గొండు సీతారాం కోరారు. కెజిహెచ్ నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఐ.వాణిని బుధవారం ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఆసుపత్రిలో బాలల హక్కుల పరిరక్షణతో ముడిపడివున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఆసుపత్రిలో పుట్టిన వెంటనే పిల్లల జన్మదిన ధ్రువీకరణ పత్రాల జారీని మరింత వేగవంతం చేయాలని కోరారు. అన్ని విభాగాల్లో పిల్లల వైద్యం కోసం ప్రత్యేక బెడ్లు, వైద్యులు, సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ వాణి మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రాంగణంలో బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యతను కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధి కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవత్సవ అభినందనలు

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని వైసిపి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త జీతాలను అమలు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మే నెలలో ఆప్కోస్ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసిన విధంగా కొత్త జీతాల బిల్లులను చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, జివిఎంసి మంచి నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు కార్పోరేషన్ తీర్మానం ప్రకారం గత సంవత్సరం డిసెంబర్ నెల నుంచి కొత్త వేతనాలు అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది మే నెలలో ఆప్కోస్ వెబ్ సైటులో కొత్త జీతాల బిల్లు అప్‌లోడ్ చేశారని, అప్ లోడ్ చేసిన కొత్త జీతాలు నేటికి జమకాకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ నెల పాత జీతాలు బిల్లునే మళ్లీ పెడుతున్నారనే విషయం తెలిసి ఆందోళనకు దిగామని తెలిపారు. మేయర్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని, విధులకు హాజరుకావాలని కోరడంతో టూల్ డౌన్ విరమించి డ్యూటీకి హాజరైనట్లు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.A.482/2023 in O.S.1207/2016

Between:
Bora Raghunadham
...Petitioner/Plaintiff
And:
1) Sri Bora Kantha Rao
2) Bora Bhaskara Rao (Died) & others ...Respondents/Defendants

NOTICE

To,
R-5: Sri Bora Gopinath,
S/o. Bora Bhaskara Rao,
Hindu, aged 45 years,
R/at D.No.40-30-38,
Dharma Nagar, Kancharapalem,
Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above I.A.482/2023 against you and the Hon'ble Court was pleased to order notice to you (R-5) in the above matter through this publication. The said I.A. stands posted to **27-06-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-06-2025** at **10:30 A.M** in the above mentioned Court, failing which the matter will be heard and determined in your absence.

KATTA SRINIVASA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9440346267.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.A.483/2023 in O.S.1207/2016

Between:
Bora Raghunadham
...Petitioner/Plaintiff
And:
1) Sri Bora Kantha Rao
2) Bora Bhaskara Rao (Died) & others ...Respondents/Defendants

NOTICE

To,
R-5: Sri Bora Gopinath,
S/o. Bora Bhaskara Rao,
Hindu, aged 45 years,
R/at D.No.40-30-38,
Dharma Nagar, Kancharapalem,
Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above I.A.483/2023 against you and the Hon'ble Court was pleased to order notice to you (R-5) in the above matter through this publication. The said I.A. stands posted to **27-06-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-06-2025** at **10:30 A.M** in the above mentioned Court, failing which the matter will be heard and determined in your absence.

KATTA SRINIVASA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9440346267.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.A.484/2023 in O.S.1207/2016

Between:
Bora Raghunadham
...Petitioner/Plaintiff
And:
1) Sri Bora Kantha Rao
2) Bora Bhaskara Rao (Died) & others ...Respondents/Defendants

NOTICE

To,
R-5: Sri Bora Gopinath,
S/o. Bora Bhaskara Rao,
Hindu, aged 45 years,
R/at D.No.40-30-38,
Dharma Nagar, Kancharapalem,
Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has instituted the above I.A.484/2023 against you and the Hon'ble Court was pleased to order notice to you (R-5) in the above matter through this publication. The said I.A. stands posted to **27-06-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-06-2025** at **10:30 A.M** in the above mentioned Court, failing which the matter will be heard and determined in your absence.

KATTA SRINIVASA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9440346267.

ప్రశాంతంగా మెగా డిఎస్‌సి పరీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : మెగా డిఎస్‌సి2025లో భాగంగా బుధవారం జరిగిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌. ప్రేమ్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మూడు, మధ్యాహ్నం ఐదు కేంద్రాల్లోనూ పరీక్ష నిర్వహించామని,రెండు పూటల్లో 1304 మంది అభ్యర్థులకుగాను, 1217 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. 93.32శాతం హాజరు నమోదైందన్నారు. తాను ఒక పరీక్ష కేంద్రాన్ని, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ మూడు కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు.

యోగాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - అరిలోవ : ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాలతో బుధవారం జివిఎంసి 13వ వార్డులో కార్పొరేటర్‌ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ, ఈనెల 21ఆర్‌కె బీచ్‌లో నిర్వహించే యోగాలో ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబుతోపాటు ఐదు లక్షలమంది పాల్గొంటున్నారని,ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలు, టిడిపి నేతలు బాలరాజు, గురుమూర్తి నగేష్‌, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జూనియర్‌ కాలేజీ ప్రిన్సిపల్‌గా కృష్ణవేణి

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సిమ కృష్ణవేణి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. షైనింగ్‌ స్టార్‌ అవార్డు స్వీకరించిన కాలేజీ విద్యార్థి జె హేమంత్‌ను అభినందించారు. ఎడిసి చైర్మన్‌ బలిరెడ్డి సత్యనారాయణ, 79వ వార్డు తెలుగు మహిళ నాయకురాలు కనక భవాని, విశాఖ అయన్స్‌ క్లబ్‌ చైర్‌పర్సన్‌ కడిమి హనుమంతరావు, ఓం శాంతి ప్రతినిధులు బికె రామకోటి, బికె. రామ్‌ భక్త కుమార్‌, కోట్ని నరిసింహామూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి ములగాడ: జివిఎంసి 62వ వార్డులో పలు అభివృద్ధి పనులకు వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు బుధవారం శంకుస్థాపన చేసారు. త్రినాథపురంలో రూ.19.95లక్షలతో రక్షణగోడ, గుడివాడ అప్పన్న కాలనీలో రూ.15.10లక్షలతో డ్రైనేజీ, రోడ్లు, మెట్ల మార్గం నిర్మాణం, అల్లూరి సీతా రామరాజు కాలనీలో రూ.14.40 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. ఆయా పనులకు జివిఎంసి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పనులకు కూటమి పాలనలో మోక్షం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో తెలుగుమహిళ వార్డు అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షులు వాసు, జనసేన అధ్యక్షులు ఇంద్రజిత్‌, సన్యాసి రావు, దిలీప్‌, శ్రీధర్‌, నర్సింగరావు, అరిగా రాజు, కన్నా రావు, కనకరాజు, నీలం రాజు, సత్యన్నారాయణ, అప్పా రావు, వెంకటలక్ష్మి, లత, జోగులమ్మ, పద్మ పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

- బూట్లు మినహా చేరిన విద్యామిత్ర సామగ్రి
- 90శాతం మందికి పూర్తిస్థాయిలో పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ :విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర సామగ్రి కిట్స్‌ అందజేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. బూట్లు మినహా విద్యామిత్ర సామగ్రి మండలస్థాయి స్టాక్‌ పాయింట్‌కు చేరుకోగా, విద్యార్థుల సంఖ్యను బట్టి ఇప్పటికే 90 శాతం పాఠశాలలకు అందజేశారు.

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్‌ స్థాయి సౌకర్యాలు కల్పించే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం కొత్తగా డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ పేరుతో విద్యామిత్ర సామగ్రి అందించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. పాఠశాలలు తెరిచేనాటికి వాటిని విద్యార్థులందరికీ అందజేయాలని నిర్దేశించింది. చినగదిలి మండలంలో 48 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసేందుకు 12,450 కిట్స్‌ అందుబాటులో ఉన్నాయి. అన్ని కిట్లలోనూ పూర్తిస్థాయిలో బ్యాగ్‌లు, ఒక్కొక్కరికీ మూడేసి

తోటగరువు ఉన్నత పాఠశాలలోని స్టాక్‌పాయింట్‌

జతల యూనిఫాంలతోపాటు 65,150 పాఠ్యపుస్తకాలు, 1479 డిక్షనరీలు ఉన్నాయి. , చినగదిలి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, విద్యా మిత్ర కిట్లు ఆరిలోవ, తోటగరువు జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక గొడౌన్‌లో ఉంచారు. అక్కడ నుంచే మండలంలోని పాఠశాలలకు చేరవేస్తున్నారు. ఇప్పటికే 90శాతానికి పైగా పాఠశాలలకు పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు.

విద్యామిత్ర కిట్‌లో ఉండేవి ఇవే..

విద్యామిత్ర కిట్‌లో ఒక స్కూలు బ్యాగ్‌, మూడు జతల ఏకరూప దుస్తులు, ఒక జత బూట్లు, 2 జతల సాక్సులు, ఒక బెల్టు, పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, నిఘంటువు ఉండాల్సిన నేపథ్యంలో బూట్లు మినహా అన్నీ ఉన్నాయని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా పంపిణీ

ఈ విద్యాసంవత్సరానికి సరిపడా పాఠ్యపుస్తకాలు, విద్యామిత్ర కిట్లకు ఇండెంట్‌ను ప్రభుత్వానికి పంపించాం. గత విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇప్పటికే అన్ని పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రిని అన్ని పాఠశాలలకు పంపించేశాం. పెండింగ్‌ సామగ్రిని కూడా త్వరలో అందజేస్తాం.

- ఎన్‌.ప్రేమ్‌కుమార్‌, జిల్లా విద్యాశాఖాధికారి

22న గీతం ప్రవేశ పరీక్ష

19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

ప్రజాశక్తి- మధురవాడ : ప్రస్తుత విద్యాసంవత్సరంలో గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం పరిధిలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 22న జాతీయస్థాయిలో 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో ఆన్‌లైన్‌ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (గ్యాట్‌-2025) నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరెక్టర్‌ ఎం.జగదీష్‌ తెలిపారు. గ్యాట్‌ ప్రవేశపరీక్ష పూర్తివివరాలకు గీతం వెబ్‌సైట్‌ www.gitam.edu ను పరిశీలించి, ఈ నెల 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌ విద్యార్థులకు సైన్స్‌ డిగ్రీ కోర్సులు

ఇంటర్మీడియట్‌ సైన్స్‌ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్‌, కంప్యూటర్‌ సైన్స్‌ విత్‌ కాగ్నిటివ్‌ సిస్టమ్స్‌, మైక్రోబయాలజీ, ఫిజిక్స్‌, మేథ్స్‌, స్టాటిస్టిక్స్‌, ఫుడ్‌సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్‌ సైన్సెస్‌లలో నాలుగేళ్ల బిఎస్‌సి (ఆనర్స్‌) కోర్సులు, మూడేళ్ల బిసిఎ కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. పిజి స్థాయిలో అప్లైడ్‌ మేథ్స్‌, బయోకెమిస్ట్రీ అండ్‌ మాలిక్యులర్‌ బయాలజీ, డేటాసైన్స్‌, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్‌, మైక్రోబయాలజీ, ఫిజిక్స్‌, స్టాటిస్టిక్స్‌, ఫుడ్‌సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్‌ సైన్సెస్‌లలో రెండేళ్ల ఎంఎస్‌సి కోర్సులు, మాస్టర్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అప్లికేషన్స్‌ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామన్నారు.

పారా మెడికల్‌ కోర్సులు

వైద్య ఆరోగ్యరంగంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని, గీతం వర్సిటీ విశాఖ ప్రాంగణంలో బిఎస్‌సి మెడికల్‌ ల్యాబోరేటరీ టెక్నాలజీ, బిఎస్‌సి ఎమర్జెన్సీ మెడిసిన్‌, ఫిజియోథెరిపి, నర్సింగ్‌ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు.

కామర్స్‌ మరియు మేనేజ్‌మెంట్‌ కోర్సులు:

మేనేజ్‌మెంట్‌ విద్యపై ఆసక్తి గల విద్యార్థులకు గీతం స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ ద్వారా యుజి స్థాయిలో బికాం, బిబిఎ (బిజినెస్‌ ఎనలిటిక్స్‌, ఫైనాన్సియల్‌ మార్కెట్స్‌), జనరల్‌ బిబిఎ కోర్సులు, పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో నిపుణుల ప్రాధాన్యత దృష్ట్యా ఎపి మెడ్‌టెక్‌ జోన్‌, అకాడమి ఆఫ్‌ హస్పటల్‌ మేనేజ్‌మెంట్‌తో సంయుక్త సహకారంతో హస్పిటల్‌ అండ్‌ హెల్త్‌ కేర్‌ మేనేజ్‌మెంట్‌ లో ఎంబిఎ కోర్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మండల సభలో మాట్లాడుతున్న ఎంపిపి రాజు

నిర్ణీత వ్యవధిలో అభివృద్ధి పనులు

భీమిలి మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో ఎంపిపి రాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎంపిపి డివిఎన్‌ఎస్‌ఎన్‌.రాజు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు బకాయిలు సత్వరమే చెల్లిస్తే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ మేరకు ఆయా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన జల్‌జీవన్‌మిషన్‌ ట్యాంకు పనులు పూర్తిచేయాలని టి.నగరపాలెం ఎంపిటిసి పల్లా నీలిమ సభ దృష్టికి తెచ్చారు. గ్రామంలోని ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి గొల్లలపాలెం స్కూల్‌ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు.భూముల రీసర్వేలో సాంకేతిక లోపాలను సరిచేయాలని, జాయింట్‌ ఎల్‌పిఎంల జారీ వల్ల 1బి ప్రింట్‌ రాక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని సింగనబంద సర్పంచ్‌ జివి.నారాయణతోపాటు టి.నగరపాలెం అనిత సభలో లేవనెత్తారు. రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. పాతపాలెం, పెద నాగమయ్య పాలెంలో అంగన్వాడీ కేంద్రాల భవనాలను మరమ్మతులు చేయాలని వైస్‌ ఎంపిపి ఎస్‌ దుర్గాలమ్మ కోరారు.జగనన్న కాలనీలో విద్యుత్‌ స్తంభాలు వెయ్యాలని అన్నవరం సర్పంచ్‌ ఎం.సంతోషికుమారి కోరారు .

అధికారుల గైర్హాజరుపై చర్యలు చేపట్టండి

మూడు నెలలకోసారి జరిగే మండల సమావేశాలకు వివిధశాఖల అధికారుల గైర్హాజరుపై జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు మండిపడ్డారు. మండల సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే అధికారులు లేకుంటే, సమావేశం నిర్వహించి ప్రయోజనమేంటని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేసి తగు చర్యలు చేపట్టడంతోపాటు వచ్చే సమావేశాలకు అధికారులంతా పూర్తి సమాచారంతో వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎస్‌.హనుమంతరావును కోరారు. సమావేశంలో వైస్‌ ఎంపిపిలు బి బంగారునాయుడు, ఎస్‌.దుర్గాలమ్మ, ఇఒపిఆర్‌డి కె రమేష్‌నాయుడు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం

- భర్తకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్‌ : దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా వన్‌ టౌన్‌ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగి భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులిద్దరూ వికలాంగులు. వన్‌ టౌన్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐ విశ్వనాథం కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం ఆర్‌.శివరాంపురానికి చెందిన దేవర చిలుక నాయుడు, భార్య కృష్ణకుమారి, రెండేళ్ల పాపతో పూర్ణా మార్కెట్‌ దగ్గర గల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయానికి బుధవారం ఉదయం వచ్చారు.. దర్శనం చేసుకుని ట్రై సైకిల్‌పై కొండ ఘాట్‌ రోడ్డు మీదుగా కిందికి వస్తుండగా, అదుపు తప్పి మలుపు వద్ద గోడను వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో కృష్ణకుమారి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. చిలుక నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. వారితో పాటు ఉన్న రెండేళ్ల పాపకు తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న స్థానిక ట్రాఫిక్‌ సిఐ షణ్ముఖరావు, ఎస్‌ఐ విశ్వనాథం అక్కడికి చేరుకొని చిలుక నాయుడును కెజిహెచ్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కృష్ణకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసును ట్రాఫిక్‌ ఎస్‌ఐ విశ్వనాథం దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ ప్లాంట్‌ వద్ద బుధవారం ఏ షిఫ్ట్‌ డ్యూటీ సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఉక్కునగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వడ్లపూడి నుంచి సింహాచలం, ఎస్‌ రామారావు అనే ఇద్దరు కార్మికులు స్టీల్‌ప్లాంట్‌లో విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళుతుండగా, డబ్ల్యూఆర్‌ఎం బస్‌స్టాప్‌ వద్ద సిఐఎస్‌ఎఫ్‌ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలుకాగా, క్షతగాత్రులను ఉక్కు జనరల్‌ హాస్పిటల్‌కు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది.

గంజాయి నిందితుడికి పదేళ్ల జైలు

-రూ.లక్ష జరిమానా విధించిన న్యాయస్థానం

ప్రజాశక్తి- విశాఖ లీగల్‌ : గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడికి పదేళ్ల కఠిన శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ విశాఖపట్నం మెట్రోపాలిటన్‌ సెషన్స్‌ జడ్జి కోర్టు తీర్పునిచ్చిందని ప్రభుత్వ రైల్వేపోలీస్‌స్టేషన్‌ సిఐ సిహెచ్‌.ధనుంజయనాయుడు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలివి.

గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై విశాఖపట్నం గవర్నమెంట్‌ రైల్వే పోలీసులు నిరంతర నిఘా, తనిఖీల్లో భాగంగా 2014లో 24 కిలోల గంజాయితో కొర్ర ప్రసాంత్‌కుమార్‌ పట్టుబడ్డాడు. దీనిపై రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్‌ దాఖలు చేయగా, ప్రభుత్వ న్యాయవాది జిఎస్‌ఎన్‌వి. ప్రసాద్‌ మార్గదర్శకత్వంలో రైల్వేపోలీస్‌స్టేషన్‌ .ధనంజయనాయుడు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్‌ జి.వెంకటేశ్వరరావు కేసులో బలమైన ఆధారాలను కోర్టుకు సమర్పించడంతో ఈ మేరకు న్యాయమూర్తి కఠినశిక్షను విధిస్తూ తీర్పుచెప్పారని సిఐ ధనుంజయనాయుడు తెలిపారు. ఈ తీర్పుద్వారా గంజాయి, డ్రగ్స్‌ అక్రమ రవాణాలో భాగమైన వారికి కఠిన చర్యలు తప్పవని న్యాయస్థానం ద్వారా హెచ్చరికలు జారీ చేసినట్లేనని సిఐ వెల్లడించారు.

గంజాయితో నలుగురి అరెస్ట్‌

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బీచ్‌రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు, కెఆర్‌ఎం కాలనీలో మరొకరిని పోలీసుల అరెస్ట్‌ చేశారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం, ముందస్తుగా అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు అప్పుఘర్‌ శ్మశానవాటిక సమీపంలో సిఐ షేక్‌ ఖాదర్‌ భాషా ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేయగా, పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురిని పట్టుకుని వారి బ్యాగుల్లో తనిఖీ చేయగా 150 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులు బొర్రా వేణుబాబు, వై మహేష్‌, బి మనోజ్‌కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ముగ్గురు నిందితులు మత్తుకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు.

అలాగే కెఆర్‌ఎం కాలనీలో మహేష్‌ వద్ద రెండు కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుడు మహేష్‌ను అరెస్ట్‌ చేసి కోర్టుకు తరలించామన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

● సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మహాసభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి- ములగాడ : మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగసంస్థల ప్రయివేటీకరణ, 44 కార్మిక చట్టాల రద్దుతో దూకుడుగా పోతోందని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభ జరిగింది. ముందుగా సిఐటియు నేతలు జి.అప్పలరాజు, వివైవి రమణరావు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం యూనియన్ ప్రధానకార్యదర్శి జి నరేష్ రెండేళ్ల కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా. కార్మికులంతా ఆమోదించారు. అనంతరం మహాసభలో జగ్గునాయుడు మాట్లాడుతూ ముందుగా మహాసభలో పాల్గొన్న కార్మికులందరికీ అభినందనలు తెలిపారు.కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ ఫైనల్ సెటిల్మెంట్, కార్మికులకు ప్రమాద నష్టపరిహారం, స్థానికులకు 75శాతం ఉద్యోగాలు, ఉద్యోగాల కల్పన, మౌలిక సదుపాయాల కోసం హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పోరాటాలను ప్రశంసించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కనీసం నోటీసు ఇవ్వకుండా నాలుగువేల మంది కాంట్రాక్ట్ కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించారని, దీనిపై సమ్మె చేస్తే కార్మికులను భయభ్రాంతులకు గురిచేసి దాన్ని విచ్ఛిన్నం చేశారన్నారని మండిపడ్డారు. హెచ్‌పిసిఎల్‌లో స్థానికులు 75 శాతం ఉద్యోగాలను కల్పించకుండా ఇతర రాష్ట్రాల కార్మికులకు ఉద్యోగ, ఉపాధికల్పిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోపోవడం దుర్మార్గమన్నారు.వచ్చేనెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జాతీయసమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి ఐదురోజులపాటు విశాఖలోనే అఖిలభారత సిఐటియు మహాసభలు జరగనున్నా యన్నారు. మహాసభకు ఎం.కృష్ణారావు, ఆర్.లక్ష్మణమూర్తి అధ్యక్షత వహించగా, మల్కాపురం జోన్ అధ్యక్షులు కె. పెంటారావు, జోన్ నాయకులు పి పైడిరాజు మాట్లాడారు.

హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు కార్మికుల నూతన కార్యవర్గం

అనంతరం హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షులుగా ఆర్ లక్ష్మణమూర్తి, అధ్యక్షులుగా ఎం.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా జి నరేష్, ఉపాధ్యక్షులుగా ఎస్ వాసు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి శ్రీను, సహాయ కార్యదర్శిగా ఎస్ ఏసుబాబు, గంటాదాసు, కోశాధికారిగా జి గణేష్, సభ్యులుగా అర్జునరావు, ప్రసాదు, తాత, బుజ్జి, దున్న, రాజేష్, లండరాజు 20 మందితో కమిటీ ఎన్నిక జరిగింది. ఎస్ వాసు వందన సమర్పణతో మహాసభ ముగిసింది.

ప్రజాశక్తి జట్టు ఘన విజయం

ఫ్లడ్‌లైట్ల వెలుగులో జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్

విజయానందంలో ప్రజాశక్తి జట్టు క్రికెట్ క్రీడాకారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో తొలిసారిగా ఫ్లడ్‌లైట్స్ వెలుతురులో విశాఖపట్నం పోర్ట్ స్టేడియం వేదికగా ప్రతిష్టాత్మకంగానిర్వహిస్తున్న జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) పోటీల్లో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ల జట్టుపై ఏడు వికెట్ల తేడాతో ప్రజాశక్తి దినపత్రిక విశాఖపట్నం ఎడిషన్ జట్టు ఘనవిజయం సాధించింది. బుధవారం సాయంత్రం పోర్ట్ స్టేడియంలో జరిగిన పోటీలో టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ జట్టు వాసు 32 పరుగుల సహాయంతో నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది.

అనంతరం 73 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ప్రజాశక్తి విశాఖపట్నం జట్టు బ్యాటర్ మహేష్ 41 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచి అద్భుత ప్రతిభ కనబర్చడంతో 7.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి, మరో 15 బంతులు మిగిలి ఉండగానే 74 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించింది. ప్రజాశక్తి జట్టు ఆటగాళ్లు మహేష్, ప్రదీప్, రమేష్, శంకర్ అద్భుత సహకారాన్ని అందించించారు. ప్రజాశక్తి జట్టు విజయం పట్ల ఎడిషన మేనేజర్ వెంకటేశ్వరరావు, బ్యూరో చీఫ్ మధుసూధనరావు, అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ రాజేష్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. జట్టు సభ్యులను అభినందించి, వారితోపాటు విజయసంబరాల్లో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సింహాచలానికి ఘననివాళి

నివాళులర్పిస్తున్న టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్

ప్రజాశక్తి- గాజువాక. : గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి ఏపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళు లర్పించారు. ముందుగా సింహాచలం చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కరణం కనకారావు, ప్రధాన కార్యదర్శి చట్టి వెంకట రమణ, సలహా దారు మురళికృష్ణ, సహాయ కార్యదర్శి ఎస్ఎస్ఎస్ఆర్.రమణ , సభ్యులు, ఆర్‌వి. రమణ, ఆర్‌టి. నాయుడు, సిహెచ్. సత్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : పితృవియోగం పొందిన తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కుటుంబసభ్యులను విశాఖపట్నం జిల్లా పర్యటనలో ఉన్న ఏపి స్టేట్ ఎస్సి కమిషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్ పరామర్శించారు. సీతంపేటలోని పల్లా ఇంటికి వెళ్ళి మాజీ ఎమ్మెల్యే సింహాచలం మృతికి సంతాపంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంనింపారు.

అనంతరం 2021లో చనిపోయిన దళిత డాక్టర్ సుధాకర్ ఇంటికి వెళ్ళి వారిని పరామర్శించారు. వారికి రావాల్సిన అమౌంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. తర్వాత ఎస్సి కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ ఇడి ఎ.సత్యపద్మ, సాంఘికసంక్షేమశాఖ డిడి కె.రామారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి.పి. విజయకుమార్, నాయకులు ఆశీష్, ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి రావాడ సీతారాం ఉన్నారు.

దేవి క్రియేషన్స్ చిత్ర షూటింగ్ ప్రారంభం

క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభిస్తున్న పైడిరాజు

ప్రజాశక్తి- ములగాడ: దేవీ క్రియేషన్ అలేఖ్య బ్యానర్‌పై మురళీకృష్ణ దర్శకత్వంలో ఉలిశెట్టి శ్రీనివాస్, అను హీరో హీరోయిన్లుగా చిత్రం షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నూనెల పైడిరాజు క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించగా, విశాఖ, అరుకు తదితర ప్రాంతాలలో రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని దర్శకులు తెలిపారు చిత్రంలో ప్రెసిడెంట్ పాత్రలో నూనెల పైడిరాజు ఇంకా నాని, జి శేఖర్, జి లోకేష్‌కుమార్ తదితర స్థానిక నటీనటులు ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. చిత్రానికి దేవి వెంకట్ కోడైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు..

ముత్తంశెట్టికి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముందస్తు జన్మదిన వేడుకలు అవంతి కాలేజీలో నిర్వహించారు. గురువారం జన్మదినం జరుపుకోనున్న ముత్తంశెట్టికి బుధవారం సాయంత్రం కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువా కప్పి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కళాశాల ప్రిన్సిపల్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు ఉన్నారు. ముందుగా ముత్తంశెట్టి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు.

కేక్ కట్ చేస్తున్న ము త్తం శెట్టి శ్రీనివాసరావు

రేపు పెదగంట్యాడలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- సీతమ్మధార :ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని విశాఖపట్నం జోన్-2, బొబ్బిలి, జగ్గంపేట డివిజన్లలోని వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్‌ఎఫ్) ఛైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. విశాఖపట్నం సర్కిల్ జోన్-2 డివిజన్ పెదగంట్యాడ సెక్షన్ కార్యాలయంలో ఈనెల 13న, విజయనగరం సర్కిల్ బొబ్బిలి డివిజన్ మెంటాడ సెక్షన్‌లో ఈనెల 17న,కాకినాడ సర్కిల్ జగ్గంపేట డివిజన్ హంసవరం సెక్షన్ కార్యాలయాల్లో ఈనెల 19న సదస్సులు జరుగుతా యన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30గంల నుంచి మధ్యాహ్నం 1.30గంల వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలను విన్నవించి పరిష్కారం పొందొచ్చన్నారు.

సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని సిజిఆర్ఎఫ్ కార్యా లయంలోనూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, సమస్యపై విచారణ జరిపి పరిష్కారచర్యలు, న్యాయం చేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపై టోల్‌ఫ్రీనంబర్ 1912కు సంప్రదించవచ్చని సూచించారు. సిజిఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ తోపాటు సభ్యులు బి సులేఖరాణి, ఎస్‌సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల 12నఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్, మూడవజోన్, ఆపరేషన్స్ విభాగం ఇఇ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు ఆనందపురం., భీమిలి పరిధిలో చేపట్టే నిర్వహణ పనుల నేపథ్యంలో జెవి అగ్ర హారం, కొత్త వలస, నిడిగట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆనందపురం: ఆనందపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి గంభీరం ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 13న శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ అప్పలనాయుడు తెలిపారు ఈగలవాని పాలెం ,పాలవలస, మెట్లమీదపాలెం, గుడిలోవ, తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

ఇసుకలపాలెంలో ఐదో తరగతి వరకు కొనసాగించాలి

ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -పద్మనాభం. మండల కేంద్రమైన పద్మనాభం పంచాయతీ పరిధిలోని ఇసుకలపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు కొనసాగించాలని పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ జ్యోతి కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇసుకలపాలెంలో 50ఏళ్లగా కొనసాగుతున్న పాఠశాలలో కొన్ని తరగతులను కుదించడం సరికాదన్నారు దీనివల్ల పదేళ్లలోపు పిల్లలు గ్రామం నుంచి పద్మనాభం పాఠశాలకు వెళ్ళి వస్తోందన్నారు. సింహాచలం, విజయనగరం ప్రధాన రహదారిని దాటి చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లడం ప్రమాదభరితమని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నార్నారు. ఈ నేపథ్యంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఇసుకలపాలెం పాఠశాలలో కొనసాగించాలని సర్పంచ్‌తోపాటు గ్రామపెద్దలు,

అర్బన్ సిడిపిఓగా నీలిమ

కొత్త సిడిపిఓకు అభినందన

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ అర్బన్ సిడిపిఓగా కె.నీలిమ బుధవారం ఆర్‌అండ్‌బి జంక్షన్ దరి ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ సిడిపిఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడి సిడిపిఓ రమణికుమారి ఎలమంచిలి బదిలీపై వెళ్లారు. సిడిపిఓగా బాధ్యతలు స్వీకరించిన నీలిమకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నీలిమ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. 2014 బ్యాచ్‌కు చెందిన నీలిమ కడప రాయచోటి, తూర్పుగోదావరి, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సిడిపిఓగా బాధ్యతలు నిర్వహించారు. 2020లో నక్కపల్లిలో 2023లో డుంబ్రిగుడలో సిడిపిఓగా బాధ్యతలు నిర్వహించి, ప్రస్తుతం విశాఖ అర్బన్ సిడిపిఓగా వచ్చారు.

16న బహిరంగ వేలం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసి జోన్-4లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం, ఒక మార్కెట్, మెయిన్ ఆఫీస్ క్యాంటీన్‌కు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు తెలిపారు. మూడేళ్ల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు నిర్వహించే బహిరంగ వేలంపాటలో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

రూ.25 కోట్ల విలువైన చెరువు హాంఫట్!

★ సబ్బవరం మండలం లగిశెట్టిపాలెంలో మీరా బంద ఆక్రమణ
★ భూకబ్జాదారులతో కుమ్మక్కైన రెవెన్యూ
★ తహశీల్దారు, ఎమ్మెల్యేకు పలు ఫిర్యాదులు చేసినా పట్టని వైనం
★ వైసిపి ప్రజా ప్రతినిధుల కబ్జాపై కూటమి మౌనం

కబ్జా చేసిన చెరువును చదును చేసి ప్లాట్లుగా వేసిన దృశ్యం

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో
సబ్బవరం మండలం ఆరిపాక పంచాయతీ శివారు లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలో కబ్జాకు గురైన ఆ చెరువు విలువ అక్షరాలా రూ.25 కోట్లు పైమాటే. ఇది వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు కబ్జా చేసినా కనీసం కూటమి ప్రభుత్వం వచ్చాకైనా ఈ వ్యవహారం తేలుతుందని భావించిన రైతులు, ప్రజలకు నిరాశే ఎదురైంది. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు కూడా కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెరువు కబ్జాపై రెండు గ్రామాల ప్రజలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు, రెవెన్యూ సదస్సులలోనూ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

ఎలా జరిగిందంటే...?

ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరం మండలం ఆరిపాక పంచాయతీ శివారు లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 37/2లో సుమారు 6 ఎకరాల 32 సెంట్లు విస్తీర్ణంలో మీరా బంద చెరువు ఉండేది. లగిశెట్టిపాలెం, గాలిభీమవరం గ్రామాల సరిహద్దులో మేరీ బంధగా పిలవబడే ఈ మీరా బంద చెరువులో ఇరు గ్రామాల పశువులు, మేకలు, గొర్రెలు మేతలు మేసి నీళ్ల తాగేవి. ఈ చెరువు పంచాయతీ రాజ్ చెరువుగా జల వనరుల శాఖ రికార్డులలో నమోదై ఉంది.

ఈ చెరువుపై ఆరిపాక సర్పంచ్ కుటుంబ సభ్యులు, గాలిభీమవరం సర్పంచ్ కన్నేశారు. వీరు ఇద్దరు ఆయకట్టుదారులను బినామీలుగా చేసుకొని గత వైసిపి ప్రభుత్వ హయాంలో కరోనా సమయంలో ఈ చెరువు గట్టును తొలగించి చెరువును కబ్జా చేశారు. దీనిపై నాడు ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ వారికి ఫిర్యాదు చేశారు. అయినా కూడా కబ్జాదారులు తప్పుడు రికార్డులు సృష్టించి పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేయగా, 2019-23లో అప్పటి తహసీల్దార్ కె.రమాదేవి, ఆర్ఐ ఐ.రమణలు అది పంచాయతీ రాజ్ చెరువు అని చెప్పి పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు నిరాకరించారు.

అయితే 2023-24లో ఎన్నికల ముందు బెల్లాపు సత్యనారాయణ సబ్బవరం తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఈ సమయంలో మళ్ళీ చెరువు కబ్జాదారులు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేశారు. దీంతో నాటి తహశీల్దారు, నాటి ఆరిపాక పంచాయితీ విఆర్వో సిహెచ్.సునంద, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, డిప్యూటీ తహశీల్దారు ఇంటి వెంకట అప్పారావు దీనిపై బాగా చొరవ తీసుకుని రెవెన్యూ రికార్డులలో క్లాసిఫికేషన్ మార్చి చెరువును ఆగమేఘాలపై కబ్జాదారుల పేరు మీద పాసు బుక్కులు, రికార్డులు చేసి ఇచ్చేశారు. దీనిపై పలుమార్లు తహశీల్దార్ బి.సత్యనారాయణకు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని అప్పటి జలవనరులు శాఖ ఎఈలు రామ లక్ష్మణ, సాయి కిరణ్ తెలిపారు.

కబ్జాదారులు బినామీల నుండి ఈ భూమిని తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్లు అయిన మరుక్షణం ఆగ మేఘాలపై ఈ చెరువు భూమిని ల్యాండ్ కన్వర్షన్ కూడా చేసేశారు. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. అనంతరం ఓ భాగంలో లేఅవుట్ వేసి రోడ్లు, ప్లాట్లుగా విభజించారు. మరి కొంత భాగంలో షెడ్లు నిర్మించి, బోరు బావులను తవ్వి వ్యవసాయం సాగు చేస్తున్నారు.

రెవెన్యూకి ముడుపులే కారణమా?

1975 ఇనాం ల్యాండ్ అబాలిష్‌మెంట్ ఎమెండమెంట్ యాక్ట్ సెక్షన్ 2ఎ ప్రకారం ఇనాం భూముల్లో జల వనరులకు చెందిన చెరువులు, గెడ్డవాగులు, బందలు, నూతులు, బావులు ప్రభుత్వానికే చెందుతాయని పొందుపరిచి ఉంది. ఎపి వాల్టా చట్టం 2002, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం జల వనరుల శాఖకు సంబంధించిన చెరువులు, గెడ్డలు, వాగులు, బందలు, నూతులు ఎటువంటి ఆక్రమణలకు గురైనా స్థితి, స్వభావం మార్చేసినా కారణమైన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయినప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకుని కబ్జాదారులకే కొమ్ము కాశారు. నేటికీ కాస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం.. కూటమి నేతల మౌనం

ఈ కబ్జా వ్యవహారంపై ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు, ఇరిగేషన్ అధికారులు పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు మీరా బంద్ చెరువు ఆక్రమణలను తొలగించడానికి వెళ్తే కబ్జాదారులు అడ్డుకున్నారు. దీంతో ఇరు శాఖల అధికారులు వెనక్కి వచ్చేశారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజా దర్బారు కార్యక్రమంలో మీరా బంద చెరువు కబ్జాను తొలగించి, యథాతథ స్థితికి తీసుకురావాలని పలువురు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ చెరువు ఆక్రమణలను తొలగించే పనిలో రెవెన్యూ అధికారులు లేకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసలు ఈ భూమి అమ్మకం చేసిన వ్యక్తులకు ఎలా భూమి దఖలు పడింది అన్న అంశాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలిస్తే గాని భాగోతం బయట పడదు. దీనిపై రెవెన్యూ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అన్నది గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గత రెవెన్యూ సిబ్బంది బదిలీలు కావడంతో ప్రస్తుత రెవెన్యూ సిబ్బంది తమ హయాంలో భూకబ్జా జరగలేదని చెప్పి తప్పించుకుంటున్నారు.

జిల్లా ఉన్నతాధికారుల జోక్యం అవసరం

ఈ భూకబ్జా గత ప్రభుత్వం హయాంలో జరిగిందని ఇప్పటి రెవెన్యూ అధికారులు ముఖం చాటేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి మీరా బంద చెరువు కబ్జాను తొలగించి, చెరువును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కౌంటర్ ఫైల్ దాఖలు చేయాల్సి ఉంది

మీరా బంద చెరువు వ్యవహారంపై కబ్జాదారులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై రెవెన్యూ అధికారులు కోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేయాల్సి ఉంది.

- బి.అప్పలరాజు, విఆర్ఓ ఆరిపాక పంచాయతీ

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుఇఇయు నేతలు

యుఇఇయు రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 11వ మహాసభ ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వేపాటి సత్యనారాయణ తెలిపారు. సోమవారం పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో బుధవారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సంస్థల పరిరక్షణ, ఉద్యోగులు, కార్మికుల హక్కుల రక్షణ కోసం యూనియన్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వేపాటి సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, కడియం రవికుమార్, జి ఏ సత్యనారాయణ, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-మునగపాక : ఉపాధి హామీ కార్మికులకు 9 వారాలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మండలంలోని వెంకటాపురం గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 9వారాల నుండి వేతనాలు చెల్లించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయి పడ్డ కూలి డబ్బులు చెల్లించాలన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కూలీలను వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. పని ప్రదేశంలో మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని, పనిముట్లు అలవెన్స్, వేసవి అలవెన్స్ కలిపి 40శాతం అదనంగా చెల్లించాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని, కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారంగా రూ.309 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ని, లోవరాజు, రామునాయుడు, రామలక్ష్మి, లావణ్య, పద్మ, పూర్ణ, నర్సింగరావు, నీలకంఠరావు, నూకఅప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు బుధవారం శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. కోటి 60 లక్షలతో తహశీల్దారు కార్యాలయ పునర్నిర్మాణానికి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చోడవరం కొత్తూరు జంక్షన్ నుండి పిఎస్ పేట వరకు నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. రైతు బజార్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.ఆంజనేయులు, ఇఓపిఆర్డి మహేష్, పంచాయతీ ఈవో నారాయణరావు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, మజ్జి గౌరీశంకర్, సకరు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, జనసేన నాయకులు సిరిపురం రమేష్, చిన్న, టి.శ్రీను పాల్గొన్నారు.

మూడు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలంలోని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు భూములు కోల్పోయిన తాళ్లపాలెం, ఉగ్గినిపాలెం రైతులతో బుధవారం ఆ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తాళ్ళపాలెం సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ ఇప్పటి భూమి ధరలకు మూడు రెట్లు పెంచి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఆరు నెలలు లోపు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తానని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హామీ ఇచ్చారు.

సమావేశంలో పాల్గొన్న నిర్వాసిత రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : కూటమి ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో రైతులు దాచుకున్న ధాన్యం గొడౌన్లను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గొల్లలపాలెం, వాడ్రాపల్లి గ్రామాలలో రబీ సీజన్లో పండించిన 7,500 క్వింటాళ్ల వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇళ్లల్లో ఖాళీ లేక ప్రభుత్వ గొడౌన్లలో దాచుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. క్వింటా ధాన్యం ధర రూ.2,225 ఉండగా దళారులు కేవలం రూ.1600, 1700కు కొనుగోలు చేసేందుకు రంగంలో దిగే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు కాండ్రేగుల నూకరాజు, బీశెట్టి గంగ అప్పలనాయుడు, కాండ్రేగుల జగన్, లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికులకు బిల్లు, వేతనాలు చెల్లించాలి

ధర్నా చేస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

ప్రజాశక్తి-చోడవరం : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సకాలంలో బిల్లులు విడుదల చేయకపోతే విద్యార్థులకు వంట ఎలా చేసి పెట్టాలని ఆమె ప్రశ్నించారు. పాఠశాలల పున:ప్రారంభం రోజుకు కూడా పెండింగులో ఉన్న బిల్లులు విడుదల చేయకపోతే అప్పులు తెచ్చి పథకాన్ని నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 20వ తేదీ లోపు బిల్లులు వేతనాలు ఇచ్చే వారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి మూడు నెలలు, నాలుగు నెలలు బిల్లులు రావడం లేదని పేర్కొన్నారు. దీంతో అప్పుల ఉబిలో కార్మికులు కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల మెనూల పేరుతో కార్మికులపై ఒత్తిడి తీసుకొస్తున్న ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయాలని కనీస ఆలోచన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి నాయకులు ఎస్ అమ్మాజీ, బి.ఉమా, కె నాగమణి, ఓ దేవుడమ్మ, ఆర్ బుచ్చిరాజమ్మ, ఎం దేవి, వరలక్ష్మి, రాజులమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో జోగినాయుడు మాస్టర్ గ్రంధాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం బుధవారం ముగిసింది. ఉపాధ్యాయురాలు గాయత్రి విద్యార్థులకు ఇంగ్లీష్, సోషల్, మాథమాటిక్స్, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్ట్స్‌తో పాటుగా పలు అంశాలపై తరగతులు నిర్వహించారు. శిక్షణలో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన మొల్లి గిరిస్మ, కాండ్రేగుల వర్షిణి, మల్ల ఉమా నరసింహ నాయుడు, మల్ల యస్వంత్‌లకు గ్రంథాలయ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి రామజోగినాయుడు, బొడ్డెడ సత్యనారాయణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మల్ల కన్నుమనాయుడు, గ్రంధాలయ కమిటీ సభ్యులు మల్ల జోగినాయుడు, ఆడారి బాలాజీ, సూరిశెట్టి సోమశేఖర్, హెమేష్, పాల్గొన్నారు.

జనసేన మండల నూతన కమిటీఎన్నిక

ప్రజాశక్తి- పరవాడ : జనసేన పార్టీ పరవాడ మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. జనసేన మండల అధ్యక్షులుగా బొద్దపు శ్రీనివాస్ కాసులు, ఉపాధ్యక్షులుగా వెన్నెల నరసింహారావు, వర్రి పరదేశి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కరణం నర్సింగరావు, అధికార ప్రతినిధిగా బండారు రాజు, కార్యదర్శులుగా మడక రమణ, పైల దినేష్, గొంతిన రాము, పంది రాజు, ఇందల అశోక్, సంయుక్త కార్యదర్శులుగా మోటూరు హరి, రావాడ శివ, కోరుకొండ శ్రీను, దూడ మసేను ఎన్నికయ్యారు.

ఎరువుల అమ్మకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-మునగపాక : తక్షణమే ఎరువుల (యూరియా) అమ్మకాలు చేపట్టి రైతులను ఆదుకోవాలని మునగపాక గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రైతు భరోసా కేంద్రం ఆవరణలో రైతులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మినికి వనతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు విల్లూరి నూకనరసింగరావు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, మల్ల సంజీవరావు, వేగి వీరి నాయుడు, వేగి పరదేశి నాయుడు, బీసెట్టి మాధవరావు, బొడ్డేడ జగన్నాథరావు, పెంటకోట శ్రీను, టెక్కలి గంగ నాయుడు, దాడి భీమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన బుచ్చిరాజు

ప్రజాశక్తి-సబ్బవరం : శాప్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రవినాయుడుకు దుస్సలువా కప్పి సత్కరించారు. ఆయన వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వి.సత్య గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా మేడ పైన గల తమ కార్యాలయం పనివేళలో 9966699633 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఎన్‌సిసి యువశక్తి క్యాంపు సందర్శన

ప్రజాశక్తి-సబ్బవరం : దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలో 13 ఆంధ్ర బెటలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణా శిబిరం-6 ఎన్‌సిసి 10 రోజులు యువశక్తి క్యాంపును బుధవారం విజిటింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ కె.శ్రీనివాసులు సందర్శించి కాడేట్స్ దగ్గర నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుభేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారులు, ఎన్‌సిసి క్యాడెట్స్, పిఐ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌పి బాలు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ నేపథ్య గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగరం ప్రభుత్వ ఎస్‌సి హాస్టల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌పి బాలు చిత్రపటానికి పులమాలవేసి నివాళులర్పించారు.

ఆకస్మికంగా మంటలు చెలరేగి లారస్ కంపెనీ బస్సు దగ్ధం

ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రమాదంలో కార్మికుల ప్రాణాలు

మంటల్లో దగ్ధమవుతున్న బస్సును ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం బవులవాడ రిక్షా కాలనీ సమీపంలో బుధవారం అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళ్తున్న లారెస్ ఫార్మా కంపెనీ బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగి బస్సు పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ గమనించి బస్సు నుండి బయటకు గెంతివేశాడు. ఆ సమయంలో బస్సులో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో చెలరేగిన మంటలకు పైనున్న ఎలక్ట్రికల్ లైన్స్ సైతం కాలితెగిపోయాయి.

ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రమాదాలు

అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ నక్కపల్లి తీర ప్రాంతాల్లో ఉన్న వందలాది బడా ఫార్మా, కెమికల్, గార్మెంట్ కంపెనీల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా ఆయా కంపెనీల బస్సుల్లోనే నిత్యం విధులకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి ఏడాది ఇలాంటి ప్రమాదాలు ఆయా కంపెనీల బస్సులలో ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. దీంతో కార్మికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. కొద్దిరోజుల క్రితం ఎలమంచిలి వద్ద బ్రాండిక్స్ కంపెనీ బస్సు ప్రమాదానికి గురై కార్మికులు పదుల సంఖ్యలో గాయల పాలయ్యారు. ఒక వైపు కంపెనీ బస్సుల్లో ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యాలపైనా, బస్సుల కాంట్రాక్టర్లపైనా ప్రభుత్వం జిల్లా, పరిశ్రమల అధికారులు, రవాణా శాఖ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అందువల్లే ప్రమాదాలు పునరావృతమవుతున్నాయి. తక్షణమే కార్మికులను తరలించే అన్ని కంపెనీల బస్సులకు ఫిట్నెస్, ఇతర భద్రతాపరమైన చర్యలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కార్మికులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిఐటియు తీవ్ర ఆందోళన

అనకాపల్లి : పరవాడ ఫార్మా సిటీ నుండి చోడవరం వెళుతున్న లారస్ కంపెనీ కార్మికుల బస్సుకు బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంపై సీఐటీయూ అనకాపల్లి జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకర్రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్మసిటీ, వివిధ పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత లేకుండా పోయిందని, కంపెనీల బస్సుల్లో సేఫ్టీ లేదనేది దీన్ని బట్టి అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇటీవల బ్రాండక్స్ బస్సు స్టీరింగ్ ఊడిపోవడంతో సుమారు 22 మంది కార్మికులు గాయాల పాలయ్యారని, అంతకుముందు ఆక్వా పరిశ్రమ బస్సు ఇటువంటి ప్రమాదాన్నే ఎదుర్కొందని తెలిపారు. పరిశ్రమలకు కార్మికులను తరలిస్తున్న బస్సుల ఫిట్నెస్, ఇతర సౌకర్యాలపై ఆర్టీవో అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని, కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి తగిన కారణాలు అన్వేషించి బస్సు ట్రావెల్ యాజమాన్యాలపైనా, కంపెనీ యాజమాన్యాలపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇరిగేషన్ కార్యాలయంలో కానరాని సిబ్బంది

అనకాపల్లి ఇరిగేషన్ ఎఇ కార్యాలయం

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులకు సాగు నీరు అందించే విషయంలో నీటిపారుదల శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఇందుకోసం అనకాపల్లిలో అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయం ఉంది. గత కొన్నేళ్ళుగా అనకాపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ చానల్స్‌కు కనీసం నిధులు కేటాయించని పరిస్థితి. దీంతో ఆయా ఆయకట్ల కింద ఉన్న రైతులు పలుమార్లు సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించడం జరిగింది. అయితే ఇటీవల అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ నియోజకవర్గంలో ఇరిగేషన్ చానల్స్ మరమ్మత్తుల కోసం రెండు కోట్ల 87 లక్షలు మంజూరైనట్టు ప్రకటించారు. దీనిపై తక్షణమే మరమ్మతులకు ఎస్టిమేషన్లు వేసి పనులు ప్రారంభించాలని కూడా ఆదేశించారు. నియోజకవర్గంలో ఈ పనులను పరిశీలించాల్సిన ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో కనీసం సిబ్బంది లేరు. సహాయక ఇంజనీరు సెలవుపై వెళ్లగా మిగిలిన సిబ్బంది ఎక్కడ ఉన్నారు కూడా తెలియని పరిస్థితి. అసలు ఇక్కడ ఎంతమంది సిబ్బంది ఉన్నారో కూడా తెలియక, సమస్యలపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఇక్కడ ఉన్న ఇరిగేషన్ కార్యాలయం కూడా ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్లాబ్ పెచ్చులు ఊడి చూడడానికి సిద్ధంగా ఉండే ఈ భవనంలోకి అధికారులు రావడానికి భయపడుతున్నారా అనే పరిస్థితి కూడా ఉంది. ఏదేమైనా రైతులకు సాగునీరు అందించవలసిన ఇరిగేషన్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం అనకాపల్లిలో నెలకొంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతు సేవా కేంద్రాలపై నిర్లక్ష్యం

మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల ఆగ్రహం

మాట్లాడుతున్న ఎంపిపి జగన్మోహన్

ప్రజాశక్తి-కె.కోటపాడు : గత వైసిపి ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాలు గ్రామాల్లో అలంకారప్రాయంగా మిగిలాయని, వాటిని అధికారులు నిర్లక్ష్యం, నిర్వీర్యం చేస్తున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాతవలస, చౌడువాడ ఎంపిటిసిలు వర్రి రామునాయుడు, ఏటుకూరు రాజేష్, రొంగలి సూర్యనారాయణ మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల సేవలు అందించాలన్న ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని, టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి భవనాలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏ భవనంలో కూడా విద్యుత్ సౌకర్యం, రహదారులు లేవని, భవనంలో లోపల చెదలు పడుతున్నా పట్టించుకోవడం లేదని వ్యవసాయాధికారి సోమశేఖర్‌ను నిలదీశారు. అయితే కాంట్రాక్టర్లు కొన్నింటిలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదని వ్యవసాయ అధికారి బదులిచ్చారు. పంచాయతీ నిధులు వెచ్చించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సభ్యులు కోరారు. మండల కేంద్రంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్మెన్, ఇతర సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని ఎంపీపీ జగన్మోహన్ కోరారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌ల గౌరవ వేతనం నిధులు విడుదలకు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియపరచాలని సభ్యులు ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆర్.శివపురంలో విషాదఛాయలు

- విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కృష్ణవేణి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విశాఖపట్నం పూర్ణ మార్కెట్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరాంపురం గ్రామానికి చెందిన దేవర కృష్ణవేణి (33) మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన దేవర చిలుకు నాయుడు (వికలాంగుడు) గ్రామంలో చిన్న బండి కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. పది ఏళ్ల క్రితం దుడ్డిపాలెం గ్రామానికి చెందిన కృష్ణవేణితో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. భార్య కృష్ణవేణికి అనారోగ్యంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌లో వైద్యం చేయించడానికి చిలుక నాయుడు స్కూటీపై తన భార్య, 8 నెలల చిన్నారి తీసుకొని వెళ్లారు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణవేణి అక్కడకక్కడే మృతి చెందారు. ఎనిమిది నెలల పాప ప్రమాదం నుండి బయటపడింది. చిలుక నాయుడు తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-మునగపాక : అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రైనీ డిఎస్‌పి ఎంవికే చైతన్య హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలించారు. కేసుల పురోగతి గురించి చర్చించారు. అనంతరం ఆయన పిటి సనర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి. ప్రసాదరావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో శ్రీకృష్ణ సెంటర్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-అనకాపల్లి : పశ్చిమబెంగాల్ మాశారద యోగా శిక్షాలయ నేతృత్వంలో ఆల్ ఇండియా యోగ కల్చర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 35వ నేషనల్ ట్రెడిషనల్ యోగాసన చాంపియన్షిప్ 2025 పోటీల్లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ గురువు బుదిరెడ్డి నరసింగరావు 55 నుంచి 65 సంవత్సరాల క్యాటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే బుదిరెడ్డి నాగమణి 65 సంవత్సరాల పైబడిన విభాగంలో ఐదవ స్థానం సాధించారు. బహుమతులు పొందిన వారిని తుమ్మపాల గ్రామ పెద్దలు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), నడిపల్లి గణేష్, పడాల గణపతి రావు, కర్రి జోగినాయుడు, పల్లెల గణేష్, అజయ్, గొంతిన వెంకట్రావు, బుదిరెడ్డి సూరిబాబు, ఆర్టీసీ సత్యనారాయణ, వియ్యపు సింహాచలం, పన్నీరు చంటి తదితరులు అభినందించారు.

పని గంటల పెంపుపై సిఐటియు నిరసన

నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్న నాయకులు, మహిళలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పని గంటలు పెంచడం కార్మికులకు ద్రోహం చేయుటమే అని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ మినిస్టేడియంలో గల గాంధీ విగ్రహం ముందు సిఐటియు నాయకులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, మున్సిపల్ వర్కర్స్ పని కాలం 10గంటలకు పెంచడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. బిజెపి తీసికొచ్చిన లేబర్ కోడ్స్ అమలులో బాగంగా రాష్ట్రంలో పని గంటలు 8నుండి 10గంటలకు పెంచారని కార్మికులకు ఇది తీరని ద్రోహం అన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీలో జనాభాకు తగిన కార్మికులు లేక పని బారం పెరిగిందని, సరైన పనిముట్లు లేక మరింత బారం కార్మికులపై పడుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు సంస్థలలో ఇప్పటికే పది గంటలు పని చేయిస్తున్నారని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకుండానే పనిచేయిస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ లు సక్రమంగా అమలు చేయలేదన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వాసుపల్లి రమణ, మోద, దేముడు, రాజు, బాబురావు, లోవ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ :కార్మికులకు 8 గంటల పని విధానం నుండి 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పరవాడ ఫార్మసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చేసిందని పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌కు వత్తాసు పలుకుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 8 గంటల నుండి 12 గంటలకు పని పెంచడం దారుణమన్నారు. ఈ నిర్ణయం కార్మిక వర్గాన్ని యజమానులకు కట్టు బానిసలుగా మార్చడమే అవుతుందన్నారు. పని గంటల పెంపు వలన కార్మికులపై మరింత పని భారం పెరుగుతుందని, కొత్తగా ఉద్యోగాలు రావని, నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితో అనేక దేశాలు పని గంటలు తగ్గించి వారానికి ఐదు రోజులు, రోజుకు ఆరు గంటలే పని చేయిస్తుండగా, అందుకు భిన్నంగా మన దేశంలో రోజుకు 12 గంటలు పని చేయాలని చట్టం చేయడం దుర్మార్గమన్నారు. మరో వైపు కార్మికుల వేతనాలు పెంచలేదని, కార్మిక వేతనాలు వాటా గతంలో 25 శాతం ఉండేదని, నేడు అది 15 శాతం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు పట్టపగలే భద్రత లేకుండా ఉందని, అలాంటిది రాత్రి పూట పనికి వెళ్ళే భద్రత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. . ఈ నిరసన ర్యాలీలో కె.అప్పలరాజు, శేషు, సత్తిబాబు, జి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో ఆందోళన చేస్తున్న నాయకులు



చెక్కును అందజేస్తున్న నాయకులు

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో ఇటీవల కాలంలో వివిధ కారణాలతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి సీఎం సహాయనిధి నుండి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు లింగన్న నాయుడు చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. లింగాపురంలో వరహాల బాబు, కొడవటిపూడిలో నారాయణరావు, కోటవురట్లలో పాతి మునిషా, రామన్నపాలెంలో రాజులకు రూ.2,13,209 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, వేచలకు జనార్దన్, జానకి శ్రీను, బోడపాలెం మాజీ సర్పంచ్ సత్యనారాయణ,తెలుగుదేశం పార్టీ యువ నాయకులు తిరుమల రావు, సుంకర బాబ్జి పాల్గొన్నారు.

డిపోను పరిశీలిస్తున్న డైరెక్టర్ శివదత్

రేషన్ షాపులను సందర్శించిన శివదత్

ప్రజాశక్తి -పాయకరావుపేట:మండలంలోని పలు చౌక ధరల దుకాణాలను రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్ సందర్శించారు. ఈ సందర్భంగా అరట్లకోట, పట్టణంలోని డిపోలను సందర్శించి అక్కడ లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ డీలర్లకు పలు సూచనలు చేశారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీలోని వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మున్సిపాలిటీకి చెందిన వాటర్ సప్లై మరిడి మహాలక్ష్మి యూనియన్ తరపున స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడకు వినతిపత్రం బుధవారం అందజేశారు. తమ సమస్యలపై దృష్టి సారించి, పరిష్కారం చూపాలని వారు కోరారు. నర్సీపట్నం మున్సిపాలిటీలోని వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. శానిటేషన్ విభాగంలోని పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లకు గత ఐదు సంవత్సరాల్లో జీతాలు పెంచినప్పటికీ, ఇంజనీరింగ్, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి జీతం పెంపు కలగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.పీఎఫ్, ఇఎస్ఐ కటింగులు పోయి జీతం తక్కువగా ఉండటంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా తమకు అందడం లేదని వాపోయారు.

ఐసిడిఎస్ సిడిపిఒగా మంగతాయారు

ప్రజాశక్తి- రావికమతం: రావికమతం ఐసిడిఎస్ సిడిపివోగా మంగతాయారు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో రావికమతం ప్రాజెక్టు సిడిపిఓగా పనిచేస్తూ కె.కోటపాడు ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. అనంతరం రావికమతం ప్రాజెక్టుకు ఉషారాణి అప్పట్లో బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇటీవల కాలంగా పదవి విరమణ చేయడంతో రావికమతం ప్రాజెక్టు అధికారిని పోస్టు ఖాళీ ఏర్పడింది. దీంతో కే. కోటపాడు లో పని చేస్తున్న సిడిపిఓ మంగతాయారు మరలా తిరిగి రావికమతం సిడిపిఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు చేపట్టాలి

నిరసన చేపడుతున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక ప్రైవేటు పాఠశాలల తీరును వ్యతిరేకిస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలను పరిశీలించి యాజమాన్యం పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి గౌతమ్, డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేయడం జరుగుతుందన్నారు. దీంతో, విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారని తెలిపారు. ఫీజులు కట్టలేదనే నెపంతో విద్యార్థులకు టీసీలు ఇవ్వకపోవడాన్ని ఎస్ఎఫ్ఐ ఖండిస్తుందన్నారు. బుక్స్ అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సులను వెంటనే తీసివేయాలన్నారు. ఈ విషయాలను పలుసార్లు మండల అధికారులకు తెలియజేసినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సమయంలో ఇటువంటి చర్యలకు పాల్పడిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కళ్యాణ్, సిద్ధు, బాలు, రమేష్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

పంచాయతీ ఆమోదంతోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-గొలుగొండ:నిబంధనలకు లోబడి పంచాయతీ ఆమోదంతోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని మండలంలో గల మేజర్ పంచాయతీ ఏఎల్.పురం గ్రామ సర్పంచ్ లోచల సుజాత సూచించారు. బుధవారం ఆమె గ్రామంలో డ్రైనేజీ, కల్వర్టుల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అకాలంగా కురుస్తున్న వర్షం నీరు డ్రైనేజీల్లో ప్రవహించేలా పూడికతీత పనులు చేస్తున్నామన్నారు. పలు వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డి కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి పథకం మోటార్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో ఇటీవల రక్షిత మంచినీటి పథకం మోటారు మరమ్మతుకు గురి కావడంతో తక్షణమే సర్పంచ్ దాసరి సూర్యకుమారి స్పందించారు. ఈ మేరకు మోటారు మరమ్మతులు చేపట్టడం జరిగింది. దీంతో ప్రజలకు తాగునీటి సమస్య ఇబ్బంది తప్పిందని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, 2000 జనాభా గలిగిన కవగుంట గ్రామానికి ఒకటే రక్షిత మంచినీటి పథకం కావడంతో ప్రజలందరూ నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అవసరమైనప్పుడు మాత్రమే నీటిని టాప్ ల ద్వారా వాడుకోవాలని సూచించారు. పంచాయతీకి వచ్చే అరకొర నిధులతో గ్రీన్ అంబాసిడర్స్కు, వాటర్ ట్యాంక్ ఆపరేటర్లకు, గౌరవ వేతనాలు, బ్లీచింగ్, కరెంటు బల్బులు, మోటార్ రిపేర్లకు మాత్రమే సరిపోతున్నాయన్నారు.

మరమ్మతు చేపడుతున్న సిబ్బంది

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఎండియు వాహనాల ద్వారా జిసిసి రేషన్ బియ్యంను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కురిడి పంచాయతీ పితమరిగూడ గ్రామ గిరిజనులు బుధవారం ఆ గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రేషన్ బియ్యంను గతంలో మాదిరిగా రేషన్ షాపుల్లో తీసుకోవాలని నిర్ణయించడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎండియు వాహనాలను పునరుద్ధరించి ఇంటింటికి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో ఈ నెల 9వ తేదీన ఓ ఇంట్లో బంగారు చోరీ కేసుల్లో ఒక మహిళను అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. అనుమానితురాలైన గుల్లింగుల చిన్నమ్ములును అదుపులో తీసుకొని విచారించగా ఆమె దొంగతనం చేసినట్లు రుజువు అయ్యిందన్నారు. దీంతో దొంగిలించిన ఆభరణాలు స్వాధీనం చేసుకొని ఆమెను కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

అధైర్య పడొద్దు!

-విశాఖ డెయిరీ కార్మికులకు అండగా ఉంటాం
-యాజమాన్యం మొండివైఖరి వల్లే సమ్మెబాట
-సిఐటియు నాయకులు నర్సింగరావు, లోకనాథం

మాట్లాడుతున్న నర్సింగరావు, లోకనాథం

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ డెయిరీ యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి వల్లే సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని, దీనికి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించి పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. డెయిరీ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసానిచ్చారు.

గతేడాది కుదుర్చుకున్న ఒప్పందాల అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి విశాఖ డెయిరీ కార్మికులు చేపడుతున్న సమ్మె బుధవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన సభలో నర్సింగరావు మాట్లాడుతూ, విశాఖ డెయిరీలో కార్మికుల బదిలీల్లో స్పష్టమైన వైఖరి లేకుండా, సీనియార్టీకి ప్రాధాన్యత లేకుండా ఇష్టానుసారంగా చేపడుతూ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.డెయిరీ లోపల మహిళా కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక గతేడాది కుదిరిన ఒప్పందం మేరకు హామీలను అమలు చేయకుండా కార్మికులను మోసగించే చర్యలకు యాజమాన్యం పాల్పడడం దుర్మార్గమన్నారు. తక్షణం సమస్యలన్నీ పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రజలందరూ డెయిరీ కార్మికుల వెంట ఉన్నారని, కార్మికులు అధైర్యపడకుండా ఐకమత్యంగా పోరాడితే, యాజమాన్యం మెడలు వంచి హక్కులు సాధించుకోగలమన్నారు. కార్మికులను విచ్ఛిన్నం చేయాలని యాజమాన్యం ఎన్ని కుట్రలు పన్నినా అంతిమంగా విజయం కార్మికులనే వరిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్ వి కుమార్, ఎం రాంబాబు, ఎన్ రాజేంద్రప్రసాద్, లోకేష్, రమణ పాల్గొన్నారు.

సమ్మె విరమణ

విశాఖ డెయిరీ కార్మికులు సమ్మె విరమించారు.లేబర్ కమిషనర్ కార్యాలయంలో డెయిరీ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు రెండు సంఘాలతో జెసిఎల్ సమక్షంలో జరిగిన చర్చల్లో ఒప్పందాల అమలు, సమస్యల పరిష్కారానికి కార్మికశాఖ అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు కార్మికసంఘాల నేతలు వెల్లడించారు. కాగా డెయిరీ కార్మికుల సమస్యలపై ఎసిపి త్రినాధ్ కూడా పలు దఫాలుగా యాజమాన్యంతో చర్చలు జరిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

-స్పీకర్‌ను కోరిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: విశాఖ డైరీ లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను స్పీకర్ అయ్యన్న దృష్టికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింహరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు లోకనాథం బుధవారం తీసుకెళ్లారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. అనధికారికంగా విశాఖ డైరీ వర్కర్స్ ను ఇతర జిల్లాలకు ట్రాన్ఫర్ చేస్తున్నారని, దీనిపై స్పీకర్ దృష్టి పెట్టి కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు సిఐటియు నాయకులు తెలియజేశారు. సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్, కార్మిక నాయకులు లోకానాథం, డైరీ యూనియన్ లీడర్ రమణ పాల్గొన్నారు.

తరలివచ్చిన వికలాంగులు

పింఛను రీ వెరిఫికేషన్‌లో..

విభిన్న ప్రతిభావంతుల పాట్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:వికలాంగ పెన్షన్ దారుల రీ వెరిఫికేషన్‌లో భాగంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన వికలాంగ సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరైన వికలాంగులు నానా తంటాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తప్పుడు పత్రాలను సమర్పించి పెన్షన్ తీసుకుంటున్నారనే ఆరోపణల మేరకు రీ వెరిఫికేషన్ మొదలుపెట్టింది. దీంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో వెరిఫికేషన్ కొరకు వచ్చిన పెన్షన్ దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గొలుగొండ మండలం చెందిన ఏటిగైరంపేట , పాకలపాడు పలు గ్రామాల నుండి వికలాంగులు ఉదయం 8 గంటలకే చేరుకోగా వెరిఫికేషన్ అధికారులు మీ గ్రామ సచివాలయ సిబ్బంది నుండి ఎటువంటి సమాచారం లేదు తర్వాత రండి అని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. సచివాలయ సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి ఎదురయిందని ఆగ్రహించారు.ఏరియా ఆసుపత్రి వద్ద సరైన సదుపాయాలు ఏర్పాటు చేయలేదని వికలాంగులు తెలిపారు.

తరలివచ్చిన వికలాంగులు

మాట్లాడుతున్న సిఐ

గంజాయి నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని పాకలపాడు గ్రామంలో నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ, ఎస్సై రామారావు ఆధ్వర్యంలో బుధవారం గంజాయి నియంత్రణ, దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి వినియోగంతో జీవితం నాశనం అవుతుందన్నారు. వీటిని రవాణా చేయడం ద్వారా జైళ్లల్లో మగ్గాల్సిన పరిస్థితి వస్తుందని వివరించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయితీ కుమ్మరిపుట్టు గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక సర్పంచ్, టిడిపి డివిజన్ నాయకులు పాంగి. పాండురంగ స్వామి ప్రారంభించారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

వినతి పత్రాన్ని ఇస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: జర్నలిస్టుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) పిలుపులో భాగంగా యూనియన్ నాయకులు బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్య అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మారిన పరిస్థితుల్లో జర్నలిస్టులకు రక్షణ కొరవడిందన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు అవకాశాలను పరిశీలించాలన్నారు. అక్రిడిటేషన్ కమిటీలో ఏపీడబ్ల్యూజెఎఫ్, ఏపీబీజెఎలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. జర్నలిస్టుల కమిటీలు ఏర్పాటుతో పాటు మీడియా అకాడమీ బలోపేతం చేయాలని కోరారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక భీమా వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీబీజే అనకాపల్లి జిల్లా కార్యదర్శి పి.మల్లేశ్వ రరావు, ఉపాధ్యక్షులు ఎంవి.రమణ, ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అర్సిహెచ్ఆర్ మూర్తి(బాబులు) తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఎంసెట్ ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన స్థానిక శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఈ కళాశాల నుండి ఎంసెట్‌లో కె. శివకుమార్ 2561 ర్యాంక్, శ్రీ మనోజ్ఞ 8033 ర్యాంక్, బి.సాయి లక్ష్మీ దీప్తి 10716 ర్యాంక్ సాధించారు. విద్యార్థులు స్పీకర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ,రాష్ట్ర స్థాయిలో గర్వించదగ్గ ర్యాంకులు సాధించడం అభినందనీయ మన్నారు. ఉన్నతంగా ఎదిగి నర్సీపట్నం ప్రాంతానికీ, తల్లిదండ్రులకూ మంచి పేరు, ప్రతిష్ట తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హోం మంత్రి అనిత
నామవరం గ్రామస్తులతో ముఖాముఖి



సమస్యలు తెలుసుకుంటున్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని నామ వరం గ్రామస్థులతో బుధవారం హెూం మంత్రి వంగలపూడి అనిత ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా హెూం మంత్రి అనిత మాట్లాడుతూ... జల్లూరు, పందూరు బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. రేవు పోలవరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా త్వరలోనే మారుస్తున్నామన్నారు. బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్ రాకతో పెద్ద సంఖ్యలో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు రానున్నాయని అన్నారు. త్వరలో పూర్తి స్థాయిలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తామని తెలిపారు. నామవరం గెడ్డకాలువను వెంటనే శుభ్రం చేయించాలని అధికారులను హెూం మంత్రి అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ కురందాసు శివ, ఎంపిపి ఇసరపు పార్వతి, తెలుగుదేశం పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్ల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పల్లా బాబూరావు, వార్డు మెంబరు షేక్ వెంకా సాహెబ్, తహశీల్దారు గారా ఆనందరావు, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ చింతలపాటి రవికుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి ఎమ్ మల్లిఖార్జునాచారి పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

పాయకరావుపేట: పట్టణంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని హెూం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ప్రారంభించారు. పార్టీ కార్యాలయాన్ని అన్ని సదుపాయాలు, సరికొత్త హంగులతో ఏర్పాటు చేసిన పార్టీ టౌన్ ప్రెసిడెంట్ యాళ్ళ వరహాలబాబు, మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు) లను ప్రత్యకంగా అభినందించారు. ప్రజల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు, అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి నక్కపల్లి లోని తన క్యాంపు కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ యాళ్ళ వరహాలబాబు, మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), జనసేన పార్టీ సీనియర్ నాయకులు, విశాఖపట్నం జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం బుజ్జి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, పార్టీ సీనియర్ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, పెదిరెడ్డి శ్రీను, చింతకాయల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.